ఊపందుకున్న రిజిస్ట్రేషన్లు

- కిటకిటలాడుతున్న సచివాలయాలు
- 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' లబ్ధిదారుల కళ్లలో ఆనందం

బత్తలపల్లి : పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల పరిధిలో 'నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు' పథకం కింద అర్హులైన పేదలకు జగనన్న లే అవుట్లలో స్థలాలు మంజూరు చేశారు. సొంతింటి కల సాకారం చేసేందుకు పక్కా గృహాలు మంజూరు చేశారు. కాలనీల్లో తాగునీరు, విద్యుత్తు తదితర మౌలిక సదుపాయాలు కల్పించారు. వేలాది ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణాలు సాగుతున్నాయి. పేదలకు ఇచ్చిన స్థలాలు హక్కులు కల్పించేందుకు పట్టాల స్థానంలో రిజిస్ట్రేషన్లు చేసే ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గ్రామ/ వార్డు సచివాలయ పరిధిలోనే లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్‌ను చేపట్టింది. తహసీల్దార్లు, ఎంపీడీఓలు ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ రిజిస్ట్రేషన్లు వేగవంతంగా జరిగేలా తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. రిజిస్ట్రేషన్ పత్రాలు అందుకున్న పలువురు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.


మాల్యవంతం సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ శివశంకర్‌నాయక్


ఎన్పీకుంటలో రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్

వేగవంతం చేయండి

సచివాలయాల్లో పేదల ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని బత్తలపల్లి తహసీల్దార్ శివశంకర్‌నాయక్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మాల్యవంతం సచివాలయంలో ఆన్‌లైన్‌లో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లోని వీఆర్వోలకు, కార్యదర్శులకు జగనన్న కాలనీల్లోని లేఅవుట్లలో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమంపై ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల కొంత ఆలస్యమైందని, ఇకపై వేగవంతం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. దీంతో అన్ని సచివాలయాల్లోనూ ప్రక్రియను వేగవంతం చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులు సైతం వెంటనే తమ పట్టాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. గడువులోగా ఇంటి పట్టాలను రిజిస్ట్రేషన్‌ను చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. అనంతరం మాల్యవంతం పంచాయతీ పరిధిలోని మాల్యవంతం, అనంతసాగరం, ఎం.చెర్లోపల్లి, వెంకటగారిపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. వాటిల్లో మౌలిక వసతులు, విద్యుత్, కిటికీలు, ఇతరత్ర సౌకర్యాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు ర్యాంపు సౌకర్యం, మరుగుదొడ్లు, నీరు తదితర వాటిని పరిశీలించారు. ఆయన వెంట వీఆర్‌ఓ మణికుమార్, కార్యదర్శి నాగరత్నమ్మ, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

180 రిజిస్ట్రేషన్లు పూర్తి

ఎన్పీకుంట: మండలంలోని ఎన్పీ కుంట-1, మరికొమ్మదిన్నె, పెడబల్లి, పి.కొత్తపల్లి సచివాలయాల్లో జరుగుతున్న పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఎంపీడీఓ ఆదినారాయణ, తహసీల్దార్ నరేంద్రకుమార్ బుధవారం పరిశీలించారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 180 ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పూర్తయినట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రమేష్ నాయుడు, ముబారక్, వీఆర్‌ఓలు దీపిక, కిష్టప్ప, డీఏ గురుస్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

ఓడీచెరువు: 'జాతీయ నులి పురుగుల నివారణ'కు సంబంధించి ముందస్తు చర్యల్లో భాగంగా అవసరమైన మందులను బుధవారం ఓడీచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పంపిణీ చేశారు. తొలుత నులి పురుగుల నివారణ మందుల పంపిణీ పోస్టర్లు ఆవిష్కరించారు. వైద్యాధికారి కమల్ రోహిత్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రక్త హీనత రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, పోషకాహారంలో ఐరన్ ప్రాముఖ్యత గురించి వివరించారు. మండల వ్యాప్తంగా ఉన్న 9,970 మంది విద్యార్థులకు అవసరమైన ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరలక్ష్మి, ఎస్.వి.బి. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయండి



ఎస్పీని కలిసిన సీఐ శివప్రసాద్

పుట్టపర్తి టౌన్: అంకితభావంతో విధులు నిర్వర్తించాలని పోలీసు అధికారులకు ఎస్పీ మాధవ్ రెడ్డి సూచించారు. బదిలీపై వచ్చి బాధ్యతలు తీసుకున్న రామగిరి సీఐ శివప్రసాద్, పట్నం ఎస్ఐ నరసింహులు బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతిభద్రతలపై దృష్టి సారించి, ఎన్నికల విధులను నిబద్ధతో నిర్వర్తించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా వారికి ఎస్పీ సూచించారు.

పోలీస్ లాంఛనాలతో కానిస్టేబుల్ అంత్యక్రియలు


కానిస్టేబుల్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వెంకటకృష్ణారెడ్డి

ధర్మవరం అర్బన్: తిరుపతిలో ఎర్రచందనం స్మగ్లర్ల వాహనం ఢీకొని ధర్మవరం పట్టణం గుట్ట కిందపల్లికి చెందిన కానిస్టేబుల్ గణేష్ మృతి చెందారు. గణేష్ అంత్యక్రియలు బుధవారం స్వగ్రామంలో పోలీసు లాంఛనాల నడుమ నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి గ్రామానికి వచ్చి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కానిస్టేబుల్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం


వక్తృత్వ పోటీల్లో మాట్లాడుతున్న విద్యార్థిని

కదిరి అర్బన్: ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని డీఎం మైనోద్దీన్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని స్పేస్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన ఉంటే ప్రమాదాలు దరిచేరవన్నారు. ద్విచక్ర వాహనం నడిపేటపుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అనంతరం రోడ్డు భద్రతపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాదిక్, అసిస్టెంట్ మేనేజర్లు హరిమోహన్, హరిత, రామక్రిష్ణ, స్టోర్ సూపర్‌వైజర్ నబీరసూల్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

కదిరి అర్బన్: పట్టణంలోని జైన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో బుధవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంవీఐ వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు రహదారి నియమాలను తెలుసుకుని ఇంట్లో పెద్దలకు తెలియజేయాలన్నారు. మైనర్లు వాహనం నడపకూడదన్నారు. కారులో సీట్ బెల్టు వేసుకోవాలన్నారు. అనంతరం ఎంవీఐని ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల జయగుప్తాతో పాటు పలువురు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం


మాట్లాడుతున్న సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్యే కడపల మోహన్‌రెడ్డి


మాజీ ఎంపీపీని కలిసిన సమన్వయకర్త మక్బూల్ అహ్మద్, సీఈసీ సభ్యుడు పూలశ్రీనివాస్‌రెడ్డి

తనకల్లు: రాబోయే ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి కదిరి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేద్దామని నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కడపల మోహన్‌రెడ్డి స్వగృహంలో తనకల్లు మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులను నింపాయన్నారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారని తెలిపారు. అందరి సహకారంతో కదిరి నియోజకవర్గంలో ముచ్చటగా మూడోసారి వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 18న అనంతపురం జిల్లా రాప్తాడులో జరగనున్న ' సిద్ధం' మహాసభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. తాను నిత్యం ప్రజల్లో ఉంటానన్నారు. పార్టీకి కార్యకర్తలే రథసారథులని, కార్యకర్తలకు ఏ సమయంలోనైనా అందుబాటులో ఉంటానని, వారికి ఏ చిన్న సమస్య తలెత్తినా అండగా ఉంటానన్నారు. త్వరలోనే మండలంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కడపల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోడానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దేశాయి భక్తవత్సలరెడ్డి, దేశాయి సంజీవరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మెకానిక్ మహబూబ్‌పీరా, నరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, మండ్లిపల్లి భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, షామీర్‌బాషా, లక్ష్మీరెడ్డి, తిమ్మారెడ్డి, మాధవ్‌రెడ్డి, నర్సిరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, దామోదర్‌రెడ్డి, వెంకటరమణ, వాలేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీతో సమన్వయకర్త భేటీ

కదిరి అర్బన్: మండల పరిధిలోని మీటీనాయక్ తండాలో ఎంపీపీ అమరనాథ్ రెడ్డి నివాసానికి బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మగ్బుల్ అహ్మద్ విచ్చేశారు. ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, ఆయన భార్య యర్రదొడ్డి గ్రామ సర్పంచ్ తోట లక్ష్మీతో కలిసి పార్టీ విషయాలు చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త పరికి సాదిక్, వైస్ చైర్మన్ అజ్జుకుంట రాజశేఖర్‌రెడ్డి, నాయకులు మురళితో పాటు పలువురు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి

తలుపుల: కదిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానికి తమవంతు కృషి చేస్తామని మాజీ ఎంపీపీ ఆవుల మనోహర్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి బుధవారం వేపకుంటలోని నివాసంలో మాజీ ఎంపీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాబోయే ఎన్నికలపై చర్చించారు. వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా అందరం కలసికట్టుగా పనిచేద్దామని మాజీ ఎంపీపీ ఆవుల మనోహర్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గిరిధర్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కులశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఆవుల వివేకానందరెడ్డి, శివారెడ్డి, దివాన్ వలి, తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి


మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ఎన్పీకుంట: ధనియానిచెరువుకు చెందిన స్కూల్ కమిటీ చైర్మన్ బావాజీ యాదవ్, సలీంబాషా, సురేష్, నాగేశ్వర్‌తో పాటు మరికొందరు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం అనంతపురంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కదిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, హిందూపురం సమన్వయకర్త బోయ శాంతమ్మ, నాయకులు వజ్ర భాస్కర్‌రెడ్డిల సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి తాము పార్టీలో చేరామని వారు తెలిపారు. ఈసారి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొత్త రంగారెడ్డి, నాయకులు చెన్నకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా నీలం

ఎన్పీకుంట: బీజేపీ మండల అధ్యక్షుడిగా నీలం చంద్రమోహన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఎన్పీకుంటలోని పార్టీ కార్యాలయంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చంద్రమోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా చలపతి, నరసింహారెడ్డి, నాగార్జున, కదిరిరెడ్డి, కార్యదర్శులుగా ఖలీల్, శ్రీనివాసులు, రమణయ్య, కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా నరసింహారెడ్డి ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కదిరి టౌన్: పట్టణానికి చెందిన టీఅండ్‌టీ నిర్వాహకుడు నవీన్ కుమార్‌రెడ్డి బుధవారం రాత్రి ద్విచక్రవాహనంపై నల్లచెరువు వైపు నుంచి కదిరికి వస్తుండగా కొలేపల్లి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. నవీన్‌కుమార్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. కదిరి ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.

రైతు ఆత్మహత్యపై విచారణ


రైతు ఆత్మహత్యపై విచారణ చేస్తున్న అధికారులు

అమడగూరు: మలకవారిపల్లి ఎగువతండాకు చెందిన రైతు మురళీకృష్ణ రెండేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్నారు. ఈయన మృతిపై ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ, ఏడీఏ సత్యనారాయణ, తహసీల్దార్ వెంకటరెడ్డి బుధవారం తండాకు చేరుకుని విచారణ చేపట్టారు. మృతి చెందిన రైతుకు ఎంత భూమి ఉంది.. వర్షాధారమా, నీటి సాగా, బోరుబావులు ఉన్నాయా.. అప్పులు దేని కోసం చేశారు తదితర విషయాలపై గ్రామస్తులు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

- అనంతరం కొట్టువారిపల్లిలో 'సూపర్ చెక్'లో భాగంగా రబీ పంటలను ఆర్డీఓ, ఏడీఏ, తహసీల్దార్ పరిశీలించారు. తర్వాత రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. తొందరగా రిజిస్ట్రేషన్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు మోకీళ్ల మార్పిడి వైద్య శిబిరం

కదిరి టౌన్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కదిరి తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో నేడు (గురువారం) ఉచిత కీళ్లమార్పిడి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు శివారెడ్డి,కార్యదర్శి ఆత్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు శ్రీచక్ర హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎం.విజయకుమార్‌రెడ్డి హాజరవుతారన్నారు. కదిరి పెన్షనర్ల భవనంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాత రిపోర్టులు, హెల్త్ కార్డ్ తీసుకురావాలని సూచించారు.

రామగిరి సీఐగా శివప్రసాద్

కనగానపల్లి: రామగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా శివప్రసాద్ బుధవారం చెన్నేకొత్తపల్లిలో బాధ్యతలు స్వీకరించారు. పోలీస్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

పట్నం ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

ముదిగుబ్బ: పట్నం ఎస్ఐగా నరసింహులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు చేపడతామన్నారు.

మాజీ విలేకరి మృతి

అమడగూరు: అమడగూరు ఎస్సీ కాలనీకి చెందిన మాజీ విలేకరి విజయ్‌కుమార్ బాబు (45) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈయనకు తల్లి, భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. విజయకుమార్‌బాబు మృతితో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

సౌకర్యాలపై ఆరా

ముదిగుబ్బ: మండల పరిధిలోని మలకవేమల, మల్లేపల్లి, చెంచుగారిపల్లి, తప్పెటవారిపల్లి పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సరస్వతి బుధవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లోని సౌకర్యాలు తదితర వాటిపై ఆరా తీశారు.

దరఖాస్తు చేసుకోండి

కదిరి అర్బన్: యర్రదొడ్డి గంగమ్మ దేవాలయ నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దేవదాయశాఖ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆసక్తి ఉన్న భక్తాదులు శ్రీసత్యసాయి జిల్లా దేవదాయశాఖ అధికారి కార్యాలయంలో నేటి నుంచి 20 రోజులలోపు దరఖాస్తు చేసుకోవాలని ఈఓ రామాంజనేయులు తెలిపారు.

మహిళల సుస్థిర జీవనోపాధికి కృషి


ప్రగతి యూనిట్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ ఓబులపతి

పుట్టపర్తి రూరల్: మహిళల సుస్థిర జీవనోపాధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి అన్నారు. బుధవారం పుట్టపర్తిలో మిషన్ డైరెక్టర్ మెప్మా సహకారంతో పట్టణ ప్రగతి యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. అందులో భాగంగానే ప్రగతి యూనిట్ ప్రారంభించినట్లు చెప్పారు. ఈ యూనిట్ ద్వారా పేపర్ ప్లేట్ల తయారీకి తగిన యంత్ర పరికరాలు, ఫర్నీచర్ అందించి శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ అంజయ్య, వైస్ చైర్మన్ తిప్పన్న, లక్ష్మీనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సాయిలీలారెడ్డి, కౌన్సిల్ విప్ సాయిగీత, కో ఆప్షన్ మెంబర్ రఫీ, వైఎస్సార్‌సీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు కవిత, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఆదినారాయణ, దూద్‌పీరా, ధరణి తదితరులు పాల్గొన్నారు.